క్లుప్తంగా

గోమాతకు అంత్యక్రియలు



జేసీబీ సహాయంతో చనిపోయిన గోమాతను అంత్యక్రియలకు తరలిస్తున్న దృశ్యం

పరిగి: మండల కేంద్రంలో మృతి చెందిన ఆవుకు సోమవారం స్థానికులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. ఆదివారం రాత్రి ఇరుకైన వాహనంలో పెద్ద సంఖ్యలో ఆవులను తరలించారు. పరిగి వద్దకు రాగానే ఆవుల మధ్య తొక్కిసలాట జరగడంతో ఒత్తిడి ఎక్కువై వాహనంలోని ఓ గోవు చనిపోయింది. దీంతో చెరువు కట్ట వద్ద ఉన్న పన్నేడమ్మ ఆలయ సమీపంలో చనిపోయిన ఆవును వదేసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం అటు వైపుగా వెళ్లిన స్థానికుడు సురేష్‌రెడ్డి గోవు చనిపోయిన విషయాన్ని గుర్తించి, వెంటనే తన జేసీబీ యంత్రంతో మిత్రులు శ్రీనివాసరెడ్డి, ప్రసాద్ సహకారంతో అక్కడి నుంచి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి సిలాట్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులకు మెడల్స్‌ను అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: రాష్ట్రస్థాయి సిలాట్ పోటీల్లో హిందూపురానికి చెందిన ఆరుగురు, పరిగికి చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సోమవారం చిత్తూరు జిల్లా పుత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 8 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించగా, ఇద్దరు విద్యార్థులు వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. సిలాట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రఫిక్ అహమ్మద్, కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, ట్రెజరర్ రియాజ్‌లు మాట్లాడుతూ సిలాట్ పోటీల్లో చంద్ర కిశోర్‌రెడ్డి, సాయి రేవంత్, చానుశ్రీ, దివ్య, మానస, జైనీల్ రెడ్డి, ఈశ్వర్, తనీశ్వర్‌రెడ్డి, తన్విత రెడ్డి, గుణసాయి వర్ధన్‌రెడ్డి ప్రతిభ చూపారన్నారు. ప్రతిభ కనబరిచిన వారు జూలైలో కేరళలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన మహిళా అధ్యక్షురాలు



పెనుకొండ: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అరుణమ్మ అలియాస్ జ్యోతక్క సోమవారం ఎమ్మెల్యే శంకరనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఎమ్మెల్యే శంకరనారాయణ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పలు విషయాలపై చర్చించారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సహాయం



హిందూపురం: పట్టణంలోని హస్నాబాద్‌కు చెందిన ఎండీ యూనుస్ భార్య క్యాన్సర్‌తో బాధపడుతోంది. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ చికిత్స నిమిత్తం బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

సంగీత పాఠశాల అభివృద్ధికి విరాళం

హిందూపురం: పట్టణ పరిధిలోని త్యాగరాజ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన త్యాగరాజ సంగీత పాఠశాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రెహానా భర్త గుడ్డుందాదు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని సంగీత పాఠశాల నిర్వాహకులకు అందించారు.

ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు శిక్షణ



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్

హిందూపురం టౌన్: ఆపత్కాలంలో ప్రజలకు వైద్యసేవలందించడం దేవుడిచ్చిన వరమని ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జిల్లా పరిధిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు వారం రోజుల పాటు శిక్షణా కార్యక్రమం 6వ బ్యాచ్‌ను సోమవారం ప్రారంభించారు.

ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టండి

• ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోంది. తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారిన ప్రతిపక్ష పార్టీలు ఎలాగైనా 2024 ఎన్నికల్లో గెలవాలని కుట్రలు, కుతంత్రాలకు తెరలేపారు. వారు చేస్తున్న కుట్రలను కుతంత్రాలను ప్రజలే తిప్పికొట్టి పేదలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలి' అని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. సోమవారం మండలంలోని కె.శివరం గ్రామ సచివాలయాల పరిధిలోని ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీలోని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయంలో కేవలం పచ్చచొక్కాలకు మాత్రమే సంక్షేమ ఫలాలు దక్కాయన్నారు. ఏం కావాలన్నా జన్మభూమి కమిటీలకు కప్పం కట్టాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు దక్కుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, డైరెక్టర్ గగన, లక్ష్మీదేవి, క్రిస్టియన్ ఫైనాన్స్ డైరెక్టర్ సుందర్‌రాజు, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, సర్పంచ్ మంజుల, వైఎస్సార్‌సీపీ నాయకులు అమరీష్‌బాబు, మంజునాథ, ప్రసాద్, బరగూరప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



అమరాపురం:కె.శివరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



హిందూపురం: పళనీనగర్‌లో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

• ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. హిందూపురం మున్సిపాల్టీ పరిధిలోని 18వ వార్డులోని పళనినగర్‌లో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వార్డు కన్వీనర్ కవితతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారా లేదా అని చూడకుండా సీఎం జగన్ ఆధ్వర్యంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ వార్డులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అభ్యర్థి ఓడినా ఓటు వేశారా? లేదా? అనేది చూడకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే బాలకృష్ణలాగా ఓట్లు వేయించుకుని కనిపించకుండా పోయి షూటింగ్‌లకే పరిమిత అయ్యే నాయకులం కాదని స్పష్టం చేశారు. సేవ చేసేవారినే ప్రజలు కోరుకుంటున్నారని ప్రజల ఆదరణతో స్పష్టం అవుతోందన్నారు. ప్రతి ఇంటా ప్రతి సమస్యను పరిష్కరించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టామన్నారు. జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నాగేంద్రబాబు, ఆయుబ్, మల్లికార్జున, రహమత్‌బీ, వాణిజ్యవిభాగం అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, జేసీఎస్ కన్వీనర్లు నైషాద్, నాయకులు లతీఫ్‌శెట్టి, ఆర్‌కె ఖలీల్, ఇలియాజ్, మన్సూర్‌ఖాన్, నాగరాజు, హుమయూన్, దాదు, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండల పరిధిలోని కమ్మవారిపల్లిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ గుప్తా తెలిపారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

అమరాపురం: మండలంలోని పేలుబండ గ్రామంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం

పెనుకొండ: దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్ఆర్ లానేస్తం ద్వారా యువ న్యాయవాదులకు సీఎం జగన్ అండగా నిలిచారని ఏజీపీ భాస్కరరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రుణం తీర్చుకోలేనిదన్నారు. రాష్ట్రంలోని 2,677 మంది యువ న్యాయవాదులకు నెలకు రూ. 5 వేలు చొప్పున 2023–24 సంవత్సరానికి సంబంధించి 5 నెలలకు సంబంధించి ఒక్కొక్కరికి రూ. 25 వేలు స్టైఫండ్‌గా జమ చేయడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రికి యువ న్యాయవాదులు రుణపడి ఉంటారన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెనుకొండ: కర్ణాటక నుంచి మండలంలోని శెట్టిపల్లికి కర్ణాటక మద్యాన్ని తీసుకెళ్తున్న నాగేంద్ర అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ. రమేష్‌బాబు తెలిపారు. అతని వద్ద నుంచి 500... 90 ఎంఎల్ హేవార్డ్స్ విస్కీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించామన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

పరిగి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ని కలిసి, ఆయన చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం సంతోషంగా ఉందని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు అన్నారు. బిజీ షెడ్యూల్ వల్ల సీఎం జగన్ ఏపీఆర్ఎస్ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు రాలేకపోయారని తెలిపారు. అయితే 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ద్వారా సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటామని తానెప్పుడూ ఊహించలేదని పేర్కొన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇలాహీ రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు సాధించగా, అతనితో పాటు నరసింహనాయుడు, లక్ష్మీవసంత్ జిల్లా స్థాయిలో మొదటి మూడు ర్యాంకులు సొంతం చేసుకున్నారన్నారు. ఇటీవల విజయవాడ కన్వెన్షన్ హాల్లో జరిగిన వేడుకలకు ప్రభుత్వ ఆహ్వానం మేరకు వెళ్లామని, పాఠశాల కీర్తి ప్రతిష్టలను మరింత గొప్పగా చాటాలని సీఎం సూచించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రోత్సాహక నగదును అందించి సన్మానించారు. ఎంఈఓ–2 శేషాచలం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం







పెనుకొండ: మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు, మడకశిరలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం , హిందూపురం: మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

హిందూపురం అర్బన్/పెనుకొండ/చిలమత్తూరు/గోరంట్ల /మడకశిర /లేపాక్షి /పరిగి / అమరాపురం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో సోమవారం మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా కృషిచేస్తున్నట్లు వక్తలు తెలిపారు. పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ సివిల్ జడ్జి శంకరరావు, హిందూపురం సప్తగిరి కళాశాలలో అదనపు మెజిస్ట్రేట్ రాజ్యలక్ష్మి, పెనుకొండలో జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ హుస్సేన్ పీరాతో పాటు ఆయా ప్రాంతాల్లో సీఐలు, ఎస్ఐ, సెబ్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు.

'స్పందన'కు ఫిర్యాదుల వెల్లువ

హిందూపురం: పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో సోమవారం హిందూపురం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం జరిగింది. సబ్‌కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తహసీల్దార్ రెహనా సుల్తానా, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. మొత్తం 94 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కొన్ని అర్జీలు ఇలా...

» అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యానికి పచ్చని చెట్లు మాయం అవుతున్నాయని వన సంరక్షకుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇష్టానుసారంగా కలప తరలిస్తున్నా అక్రమార్కులతో కుమ్మక్కై అధికారులు నామమాత్ర ఫైన్లు వేస్తున్నారని ఆరోపించారు. దీనిపై డీఎఫ్ఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయిస్తానని సబ్ కలెక్టర్ చెప్పారు.

» పోచనపల్లి గత ఏడాది కురిసిన వర్షాలకారణంగా బ్రిడ్జి కూలిపోయింది. ఆబ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మించాలని సబ్‌కలెక్టర్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి వినతిపత్రం అందజేశారు.



పోచనపల్లి బ్రిడ్జిని నిర్మించాలని అర్జీ ఇస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి

» మున్సిపల్ వర్కర్లకు ఈపీఎఫ్, ఈఎస్ఐ, కార్మికులకు అదనపు వేతనం, క్లాప్‌వర్కర్స్‌కు రూ.18,500 వేతనం అందించాలని సీఐటీయూ నాయకులు నరసింగప్ప, జగదీష్, ఆనంద్ తదితరులు సబ్‌కలెక్టర్‌ను కోరారు.

» కొత్త కాయగూరల మార్కెట్‌లోని వ్యాపారులు తమకు వ్యాపారాలు జరగడంలేదని మార్కెట్ బయట అన్ని వ్యాపారాలు జరుగుతుండటంతో ప్రజలు మార్కెట్లోకి రావడంలేదని వాపోయారు. గుడ్‌విల్‌ను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

హిందూపురం అర్బన్: పట్టణ రెండో పోలీస్‌స్టేషన్ పరిధిలోని పదో వార్డు శ్రీకంఠపురంలో సోమవారం సౌమ్య (35) అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు... లక్ష్మీపురం సచివాలయం సమీపంలో చోళసముద్రానికి చెందిన మధు, సౌమ్య దంపతులు నివాసం ఉంటున్నారు. సౌమ్యది కర్ణాటక రాష్ట్రం కనకపుర. 14 ఏళ్ల క్రితం వీరికి వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మధు ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తున్నట్లు తెలిసింది. అయితే భార్యాభర్తల మధ్య సోమవారం చిన్నపాటి వివాదం జరిగింది. అనంతరం ఇంట్లో ఎవరూలేని సమయంలో సౌమ్య ఉరివేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఆర్య వైశ్యులకు అండగా ఉంటాం

పావగడ: తన గెలుపుకు సహకరించిన స్థానిక ఆర్య వైశ్యుల మేలును మరచిపోనని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉండి సేవలందిస్తానని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ అన్నారు. స్థానిక ఆంజనేయశెట్టి కల్యాణ మంటపంలో సోమవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో స్థానిక ఆర్య వైశ్య సంఘం పదాధికారులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. సీనియర్ కాంగ్రెస్ నేత ధర్మపాల్, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు సుదేశ్ బాబు, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇంటర్వ్యూలు

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల కోసం 28న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న యువతీ యువకులు తమ ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి 5 గంటల లోపు ఎంపీడీఓ కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

హిందూపురం టౌన్: కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేసే దిశగా అన్ని నియోజకవర్గాల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసున్నట్లు పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయాన్ని సోమవారం ఏపీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు.

పరిగి: మండలంలోని సేవామందిరంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఏఐసీసీ మయప్పన్ నాయకులకు పలు సూచనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం



పావగడ: స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కుంభాభిషేక హోమాలు నిర్వహించారు. హిందూపురంకు చెందిన వేద పండితులు సాత్విక్, ప్రాణేశ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



హనుమంతరాయప్పను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: మండలంలోని కె.శివరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు హనుమంతరాయప్పతో పాటు ఆయన కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నుంచి నరసింహామూర్తి కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

జగనన్న సురక్షపై సర్వే



అగళి: నరసంబూది గ్రామంలో జగనన్న సురక్షపై సర్వే చేస్తున్న ఎంపీడీఓ నరేంద్రకుమార్

అగళి/రొద్దం/మడకశిరరూరల్:/ రొద్దం, అగళి, మడకశిర ప్రాంతాల్లో సోమవారం జగనన్న సురక్షపై అధికారులు సర్వే నిర్వహించారు. అర్హత ఉండి ఏదైనా పథకం అందలేదా? ఎందుకు రాలేదు? ఎక్కడ సమస్య ఉంది అన్న దానిపై ఆరా తీస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మిగిలిన సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

అగళి: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్లో 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీకి ఈ నెల 30న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చక్రధారి తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు పరీక్ష ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న వారందరూ తప్పక హాజరుకావాలన్నారు.

భూగర్భ జలాలు పెరిగేలా కృషి

గోరంట్ల: కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి రాజేంద్రకుమార్ నేగి నేతృత్వంలోని బృందం మండలంలో పరిశీలించింది. గోరంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు శంకర్ పొలంలో ఉపాధి పనుల ద్వారా చేపట్టిన ఫారమ్‌పాండ్ పనులను తనిఖీ చేయడంతో పాటు స్థానిక రైతులతో మాట్లాడారు. భూగర్భ జలాలు పెంపొందేలా మరిన్ని నీటి కుంటలను ఉపాధి పనుల ద్వారా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు రాఖీ, జాతీయ ఉపాధి పథకం జాయింట్ కమిషనర్ శివప్రసాద్, డ్వామా పీడీ రామంజినేయులు, సహాయ సంచాలకులు శివనందనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న జలశక్తి అభియాన్ సభ్యులు



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

పక్కాగా భూ సర్వే

గుడిబండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూర్వేను పక్కాగా చేపట్టాలని సబ్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని రాళ్లపల్లిలో చేపట్టిన భూర్వేను సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. అలాగే గ్రామంలోని ఎస్సీ శ్మశాన స్థలాన్ని పరిశీలించారు. స్థానిక రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి, రెవిన్యూ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

వడ్డెర్ల సంక్షేమానికి కృషి

రొళ్ల: రాష్ట్రంలో వెనుకబడిన వడ్డెర్ల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర వడ్డెర్ల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రేవతి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళినితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత హెచ్‌ఎం పల్లి గ్రామంలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు స్వగృహంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో కుంచిటి వక్కలిగ, వడ్డెర, కురుబతో పాటు వివిధ వర్గానికి చెందిన వారికి ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి గుర్తింపు తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుంచిటి, వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్లు నళిని, రేవతి

అర్జీదారులకు స్థలాలు చూపండి

పెనుకొండ: అర్జీదారులకు ఇంటి స్థలాలు చూపాలని లేకపోతే 15 రోజుల్లో గుడిసెలు వేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గంగాధర్ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం అర్జీదారులతో కలసి నాయకులు ఆందోళన చేపట్టారు.

కానుకలు ఎత్తుకెళ్లిన వారిపై చర్యలు తీసుకోండి

అమరాపురం: 'స్థానిక లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో హుండీ పగులగొట్టి ఎస్‌కే.చంద్రశేఖర్, పీఎస్.వేణుగోపాల్ కానుకలు, నగదును తీసుకెళ్లారు.. దీనిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశాం. అయినా వారు చర్యలు తీసుకోలేదు. వెంటనే వారిపై చర్యలు తీసుకునేలా చూడండి' అని ఎమ్మెల్యే తిప్పేస్వామికి ఆలయ అర్చకుడు శ్రీనిధిభట్టాచార్యులు, శ్రీనివాసగుప్తా విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తిప్పేస్వామి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద హెచ్‌పీ గ్యాస్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్యాస్ వినియోగ సమయంలో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సేల్స్ మేనేజర్ సుమిత్ర వర్మ వివరించారు. ఎస్ఐ విజయ్ కుమార్, జెడ్పీటీసీ అశోక్, ఉప సర్పంచ్ వేణు, డీలర్ మంజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వండి

లేపాక్షి: కాటికాపర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తహసీల్దార్ బాబుకు సోమవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు వినతిపత్రం అందించారు.